అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 12 మార్చి 2023

17న బహిరంగవేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2023-24 సంవత్సరంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మేకలు, గొర్రెలు మరియు పశువులను వధించేందుకు ఫీజు వసూలు చేసే హక్కు కల్పించేందుకు గాను ఈ నెల 17న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పశువులను వధించేందుకు ఉదయం 11 గంటలకు, మేకలు, గొర్రెల వధశాలకు మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగవేలం నిర్వహించనున్నామని, వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ. లక్ష చొప్పున ధరావత్తును నగదు లేదా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆస్తి పన్ను, నీటి పన్నులు ఈ ఏడాది మార్చి వరకు చెల్లించి ఉండాలని స్పష్టం చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కమాన గ్రామ పంచాయతీలోని బెస్తవాడలో శనివారం సర్పంచ్ పెందూర్ పవన్ సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం నుండి రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గతంలో బెస్తవాడలో సీసీ రోడ్డు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడడంతో రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోశం, ఉప సర్పంచ్ లలిత, వార్డు సభ్యులు ఆనంద్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ దేవిదాస్, స్థానికులు భీంరావు, గంగారాం, పోచం, రవీందర్, రాజయ్య, అశోక్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో కార్మికులను నియమించాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాపు, కైరిగూడ ఓపెన్‌కాస్టులో కార్మికుల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే 200 మంది కార్మికులను ఇతర ఏరియాల నుండి నియమించాలని టీబీజీకేయస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. శుక్రవారం గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులందరు కార్మికుల కొరత గురించి ఏరియా నాయకత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. టీబీజీకేఎస్ గౌరవఅధ్యక్షురాలు కవితపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, చర్చల ప్రతినిధి దరావత్ మంగీలాల్, జనరల్ మేనేజర్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మాన్కు సమ్మయ్య, తోగిలాల రవీందర్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి ఎం కుమారస్వామి, ఏరియా నాయకులు రాజేశం, కృష్ణ, వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి కందుల తిరుపతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండ్లికి హాజరైన గ్రంథాలయ సంస్థ చైర్మన్



నవతెలంగాణ - జైనూర్

మండలంలోని పొచ్చంలొద్ది గ్రామంలో శనివారం మడావి గిరిజాబాయి కూతురు వివాహ వేడుకకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవితో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతీ సాంప్రదాయాలతో నూనత వధూవరులు అతిథులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జాడి రవీందర్, పెందూర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కైరిగూడ ఓసీపీని సందర్శించిన డైరెక్టర్

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని శనివారం డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కె కొండయ్య జీఎం(పీఅండ్‌పీ), బెల్లంపల్లి జీఎం జి దేవేందర్ సందర్శించారు. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనులపై సమీక్షించారు. అదేవిధంగా వట్టివాగు డైవర్షన్ పనులను పరిశీలించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలపై అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్పత్తి సాధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కైరిగూడ పీఓ ఎస్ ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జ్యుడీషియల్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షుల పదవుల కోసం పోటీ నెలకొంది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎలమద్రి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా సుకుమార్, అమృత వాణి, కోశాధికారి కిషన్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, గంగుతాయి, స్పోర్ట్స్ సెక్రటరీ దినేష్, మహిళ ప్రతినిధి ఉమావతిలు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఇతర సభ్యులను పలువురు ఉద్యోగులు శాలువాతో పూలమాలతో సత్కరించి అభినందించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మినరసింహం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉన్న వారు ఈ నెల 14లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పత్తి ధర పెరిగేదెప్పుడో..?

- నెలల తరబడి ఇండ్లలోనే మగ్గుతున్న నిల్వలు
- రోజురోజుకూ దిగజారుతుండటంతో ఆందోళన
- విక్రయిస్తే నష్టపోతామనే భావనలో అన్నదాతలు
- కొనుగోళ్లలో పూర్తిగా చేతులెత్తేసిన సీసీఐ

పత్తి ధర ఎప్పుడు పెరుగుతుందో తెలియదు..అసలు పెరుగుతుందని అధికార వర్గాల నుంచి ఎలాంటి భరోసా లేదు. కానీ అన్నదాతలు ధర పెరుగుతుందనే గంపెడాశతో ఉన్నారు. ఇంట్లో జాగా లేకపోయినా నెలల తరబడి నిల్వ చేశారు. రోజురోజుకు ధర తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో అమ్మలేక..ఇంట్లో విక్రయించలేక నరకయాతన పడుతున్నారు. కొందరు రైతులు గత్యంతరం లేక మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి ఇక్కడి కంటే మెరుగైన ధరకు విక్రయిస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో రైతులకు అండగా ఉండాల్సిన కేంద్రప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పూర్తిగా చేతులెత్తేసింది. ఈ ఏడాది వాణిజ్య కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించిన సదరు సంస్థ రైతుల వద్ద నుంచి కనీసం కిలో పత్తి కూడా కొనుగోలు చేయలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రయివేటు వ్యాపారులు చెల్లించిందే ధరగా మారుతోంది.



తాంసి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు అనిల్. తాను పండించిన పత్తి పంటను మార్కెట్‌లో విక్రయించకుండా ధర పెరుగుతుందనే ఆశతో ఇంట్లోనే నిల్వ చేశారు. గతేడాది పత్తి విక్రయించిన తర్వాత ధర పెరగడంతో క్వింటాల్‌కు రూ.1500చొప్పున నష్టపోయారు. ఈ ఏడాది అలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ధర పెరిగిన తర్వాత విక్రయిద్దామని ఇంట్లోనే నిల్వ చేశారు. ప్రస్తుతం చేతిలో డబ్బులు లేక కౌలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని వాపోతున్నాడు. ఇలాంటి రైతులు జిల్లాలో అనేక మంది ఉన్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, తాంసి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికశాతం రైతులు పత్తి పంటనే ఆధారంగా బతుకుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 18లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇందులో పత్తి పంట సుమారు 12లక్షల ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించింది. సాధారణంగా ఎకరాకు 8 నుంచి 10క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 3 నుంచి 5క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చింది. దీంతో రైతులు పంట నష్టం జరిగి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. దీనికి తోడు మార్కెట్‌లో ధర కూడా లేకపోవడం వారిని మరింత అవస్థల్లోకి నెట్టింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6380 ఉండగా ప్రయివేటు వ్యాపారులు తొలుత రూ.8300వరకు చెల్లించారు. ఇంకా ధర పెరుగుతుందనే నమ్మకంతో రైతులు ఆ సమయంలో పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లలేదు. దీంతో పత్తి ధర క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ఆందోళన చెందారు. ఇదే సమయంలో సీసీఐ కూడా వాణిజ్య కొనుగోళ్లు చేపడుతామని చెప్పినప్పటికీ ప్రయివేటు వారితో సమానంగా ధర నిర్ణయించింది. కేవలం రూ.10 మాత్రమే ఎక్కువ ధర నిర్ణయించడంతో ఈ సంస్థకు రైతులెవరూ పత్తిని విక్రయించలేదు. దీంతో సదరు ప్రభుత్వ రంగ సంస్థ కనీసం కిలో పత్తిని కూడా కొనుగోలు చేయలేకపోవడం విమర్శలకు తావిచ్చింది.

పెరుగుతుందనే ఆశతోనే..!

పత్తి మార్కెట్ ప్రారంభమై సుమారు మూడు నెలలు కావస్తున్నా పత్తి ధరలో మార్పులు రావడం లేదు. తొలుత రూ.8300వరకు ఉన్న ధర క్రమంగా దిగిపోయి ప్రస్తుతం రూ.7300వరకు చేరింది. దీంతో ఈ ధరకు పత్తిని విక్రయించలేక రైతులు ఇంట్లోనే క్వింటాళ్ల కొద్ది పత్తిని నిల్వ చేశారు. కిందటేడాది ఇదే సమయానికి 6.50లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు రాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 5.30లక్షల క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అటు ధర పెరగకపోవడం.. ఇటు పత్తి వెయిట్ తగ్గిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని రోజుల్లో ధర పెరుగుతుందనే ఆశతో ఉన్నారు. పత్తిని విక్రయించలేక..చేతిలో డబ్బుల్లేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. అధికారవర్గాలు మాత్రం రానున్న రోజుల్లో పత్తి ధర పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. కానీ అన్నదాతలు మాత్రం నమ్మకంతో ఉన్నారు. గతేడాది మాదిరిగానే పత్తి మొత్తం విక్రయించిన తర్వాత పెరుగుతుందని కష్టమైనా అప్పటి వరకు ఆగితే మంచి ధర వచ్చే అవకాశం ఉందనే భరోసాతో ఉన్నారు. రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నా ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ మాత్రం ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరీక్షలు అంటేనే ప్రారంభం నుండి పూర్తయ్యే వరకు ఎన్నో రకాల ఒడిదొడుకులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పరీక్షలు సక్రమంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులను ఉత్తమ ఫలితాల కోసం సంసిద్ధులను చేయడం అధ్యాపకులతో పాటు విద్యాధికారుల కూడా పెద్ద సవాల్. అటువంటి సవాల్‌ను స్వీకరించడంతోపాటు గత సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం ప్రస్తుత సంవత్సరం దాన్ని నిలబెట్టుకోవడానికి జిల్లా విద్యాశాఖాధికారులు కృషి చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు విద్యార్థులను సిద్ధం చేస్తూనే ఈ నెల 15 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా చేపడతామని చెబుతున్న ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్‌తో ముఖాముఖి.

ప్రశ్న: జిల్లాలో ఇంటర్ విద్యార్థులు ఈ సారి ఎంతమంది పరీక్షకు హాజరు కాబోతున్నారు?

డీఐఈవో: జిల్లాలో ఇంటర్ విద్యార్థులు మొత్తం 9933 మందిలో జనరల్ 8457, ఒకేషనల్ విభాగంలో 1476 మంది హాజరు కానున్నారు. ఈ సారి ప్రథమ సంవత్సరం పరీక్షకు 5135 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1478 మంది విద్యార్థులు హాజరు కాబోతున్నారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డీఐఈవో: ఇంటర్ వార్షిక పరీక్షల నిమిత్తం 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసాం. ఇందులో 11 ప్రభుత్వ, 6 ప్రభుత్వరంగ, 3ప్రయివేట్ కళాశాలలున్నాయి. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు అన్ని పరీక్షా కేంద్రాలను ముందస్తుగా సందర్శించి తగు నివేదికలు రూపొందించి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి వసతులు ఏర్పాటు చేయబోతున్నారు?

డీఐఈవో: పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం అన్ని ఏర్పాట్లు చేయబోతున్నాం. ఎండా కాలం దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా ఫ్యాన్లు, నీటి వసతులపై దృష్టి సారిస్తున్నాం. అన్ని పరీక్షా కేంద్రాల్లో డ్యుయల్ డెస్కులు, తగు ఫర్నీచర్ ఏర్పాటుకు ఆదేశించాం. సీసీ కెమెరాలు, ఇంటర్నెట్, కంప్యూటర్, ప్రింటర్ తదితర సదుపాయాలు కేంద్ర నిర్వాహకులు సమకూర్చుకోవాలి. గైర్హాజరైన విద్యార్థుల సమాధాన పత్రాల బార్ కోడ్‌లను స్కానింగ్ చేసి ఎప్పటికప్పుడు బోర్డు వెబ్ సైట్‌కు సమాచారం పంపించే ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సీసీ కెమెరాలు ఉంటాయా?

డీఐఈవో: సీసీ కెమెరాలు ఉన్న కాలేజీలనే ఇంటర్ బోర్డు పరీక్షా కేంద్రంగా గుర్తించింది. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రిన్సిపాల్ కార్యాలయంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో మాత్రమే ప్రశ్నపత్రం ప్యాకెట్లు తెరువబడుతాయి. సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో మాత్రమే సీసీ కెమెరాల సమక్షంలో సమాధాన పత్రాల బార్ కోడ్ స్కానింగ్, ప్యాకింగ్ తదితర పనులన్నీ నిర్వహించబడుతాయి. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి.

ప్రశ్న: పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారు?

డీఐఈవో: పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి అంతర్గత పరీక్షలపై దృష్టి సారించాం. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అర్ధ వార్షిక, పూర్వ వార్షిక పరీక్షల మార్కులను ఎప్పటికప్పుడు క్రోడీకరిస్తూ గత పరీక్షలో ఫెయిలైన విద్యార్థులకు తగు తర్ఫీదు నిస్తున్నాం. పరీక్షల్లో తరచూ అడిగే ప్రశ్నలపై దృష్టి సారించేలా అధ్యాపకులు సాయంత్రం వేళల్లో అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాలల్లో అకాడమిక్ మానిటరింగ్ టీం ఆధ్వర్యంలో నిరంతరం విద్యార్థుల మార్కులపై దృష్టి సారిస్తున్నాం. విద్యార్థులను ఏ,బీ,సీ క్యాటగిరీలుగా విభజించి ఫెయిలవుతున్న విద్యార్థులపై ఎక్కువ సమయాన్ని కేటాయించేలా ప్రణాళికలు రూపొందించాం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల నమూనాలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు తగు శిక్షణ నిస్తున్నాం.

ప్రశ్న: ఈ సారి ప్రశ్నపత్రం లో ఏమైన మార్పులు ఉంటాయా?

డీఐఈవో: ఈ సారి ప్రశ్నపత్రం వంద శాతం సిలబస్‌తో రూపొందించబడింది. మార్పుల విషయానికొస్తే ద్వితీయ సంవత్సరం ఆంగ్లం నూతన సిలబస్‌తో పరీక్ష నిర్వహించనున్నాం. సిలబస్‌కు తదనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులకు ఎప్పటికప్పుడు తగు సూచనలిస్తున్నారు.

ప్రశ్న: ప్రస్తుతం పూర్తి సిలబస్‌తో పరీక్ష ఉంటుందా?

డీఐఈవో: కోవిడ్ సమయంలో విద్యార్థుల సౌలభ్యం కొరకు గత విద్యా సంవత్సరం వరకు 70 శాతం సిలబస్‌తో పరీక్ష నిర్వహించాం. కానీ ఈ సారి వంద శాతం సిలబస్‌తో అన్ని పరీక్షలు నిర్వహించబోతున్నాం. ముందు నుండే బోర్డు ఆదేశాల మేరకు కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా విద్యార్థులకు సమాచారం అందించి పూర్తి సిలబస్‌తో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం.

ప్రశ్న: గతేడాది ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సారి మీ అంచనా ఎలా ఉంది?

డీఐఈవో: గతేడాది ఇంటర్ పరీక్షా ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సారి కూడా ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండడానికి ప్రయత్నిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మంచి ఫలితాలు సాధించడానికి తగు సూచనలిచ్చాం. ఫలితాలు సాధించడానికి తగు ప్రణాళిక రూపొందించి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాం. ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగితే చక్కని ఫలితాలు సాధించవచ్చనే వ్యూహాన్ని అమలు పరుస్తున్నాం.

ప్రశ్న:కళాశాలలో ఉత్తమ ఫలితాల కోసం ఎటువంటి ప్రణాళిక అమలు పరుస్తున్నారు?

డీఐఈవో ఇంటర్ ఫలితాల్లో జిల్లా ఈ సారి కూడా అగ్రస్థానంలో ఉండడానికి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాం. ముఖ్యంగా గత ఫలితాలను విశ్లేషిస్తూ ఎక్కువగా ఫెయిలవుతున్న కళాశాలల్లో విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. అంతర్గత పరీక్షల ద్వారా విద్యార్థుల్లో లేఖన సామర్థ్యాన్ని పెంపొందించడానికి తగు ప్రయత్నాలు చేస్తున్నాం. అధ్యాపకులు నిరంతరం సిలబస్‌తో పాటు ముఖ్యమైన ప్రశ్నల సాధనపై దృష్టి సారిస్తున్నాం. వార్షిక పరీక్షల్లో ఫలితాలు సాధించడమే కాకుండా ఎంసెట్ తదితర పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించడానికి మెరిట్ సాధించే విద్యార్థులపై దృష్టి సారిస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు మీరిచ్చే సందేశం ఏమిటి?

డీఐఈవో: ఎటువంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులు పరీక్ష రాయాలి. పరీక్ష కేంద్రాల్లో కావాల్సిన అన్ని సౌకర్యాలు విద్యార్థులకు ఇప్పటికే కల్పించాం. విద్యార్థులు బాగా రాసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

పదో తరగతిలో విద్యార్థులు సత్తా చాటాలి

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ



నవతెలంగాణ - జైనూర్

రాబోయే రోజుల్లో విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో తమ సత్తా చాటాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ అన్నారు. శుక్రవారం జైనూర్ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతం కంటే ఈ ఏడాది విద్యపై ప్రత్యేక ప్రణాళికతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరిగిందని ప్రశంసించారు. ఉట్నూర్ ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్షరజ్యోతి కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని గుర్తు చేశారు. ప్రతి ఒక విద్యార్థి ఆశ్రమ పాఠశాలలో చదివి ఉన్నతస్థాయిలో ఎదిగేందుకు పోటీ పడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణులై రాష్ట్రవ్యాప్తంగా మండలానికి మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులకు పాఠశాలలో విద్యతో పాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె అభినందించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ ఆత్రం భాస్కర్, జైనూర్ ఏటీడీఓ పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు సోనేరావు, నీలకంఠ్, వార్డెన్ గజానన్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి మధు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్ట తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి మధు కోరారు. శనివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను, సంస్థలను, వ్యవసాయాన్ని ప్రైవేట్ కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్రలకు బీజేపీ ప్రభుత్వం పూనుకుంటోందని అన్నారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ, గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు అంబాల ఓదేలు, ఆర్ చంద్రశేఖర్, జాదవ్ రాజేందర్, శ్రీకాంత్, చంద్రయ్య, మోరేష్; నగేష్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దె స్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐని శాలువాతో సత్కరించారు. పోలీసు శాఖ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు సీఐకి వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, బి నర్సయ్య, ఎం సుభాష్, నారాయణ, టి నర్సింగారావు, పురుషోత్తంకుమార్, అల్లి రాజయ్య, రాజేశ్వర్‌రావు, జాన్ బర్నాబస్ పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పిచ్చి కుక్క దాడిలో ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. పట్టణంలోని



ఆదర్శనగర్, ఖోజా కాలనీలో శనివారం ఉదయం పనిలో నిమగ్నులైన వ్యక్తులపై వేరువేరుగా ఓ పిచ్చికుక్క దాడి చేసింది. దీంట్లో ఏడుగురిని పిచ్చికుక్క తీవ్రంగా కరిచింది. వెంటనే స్థానికులు వారిని రక్షించి రిమ్స్‌కి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తోపుడుబండి దగ్ధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

షార్ట్ సర్క్యూట్‌తో తోపుడు బండ్లు దగ్ధం అయిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి శివాజీ చౌక్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్ ప్రాంతంలోని ఒక గదిలో భద్రపరిచే 4 తోపుడు బండ్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది. అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేసింది. తోపుడు బండ్లు ఉన్న ప్రాంతంలో బ్యాటరీలు ఉండటంతో ప్రమాదం ఏర్పడినట్టు వారు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20వేల ఆస్తి నష్టం జరిగినట్టు పేర్కొన్నారు.



విద్యా, సాంస్కృతిక కళల్లో రాణించాలి

- జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థుల్లోని విద్యా, సాంస్కృతిక, కళల్లో రాణించాలని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శనివారం స్థానిక కేబీ కాంప్లెక్స్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గిరిజన కల్చరల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మెన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులలో దాగివున్న విద్యా, కళా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి గిరిజన కల్చరల్ కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో సైన్స్ ఫేర్, కల్చరల్ ఫేస్ట్, వార్షికోత్సవాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ కళలను సహకారం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయిలలో నిలవాలని కోరారు. ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ చాటేలా ప్రతి సంవత్సరం గిరిజన కల్చరర్ ఫేస్ట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఆశ్రమ విద్యార్థులు డివిజన్ స్థాయిలలో నిర్వహించిన నృత్య ప్రదర్శన, పాటలు, జానపదాల ఆలాపన, చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలతో పాటు మాక్ పార్లమెంట్, స్పెల్ (బి), మిమిక్రీ వంటి పోటీలలో ప్రతిభ కనబరిచి ఈ గిరిజన



కల్చరల్ ఫేస్ట్‌లో పాల్గొంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో క్రీడోత్సవాలు, జనవరిలో సైన్స్ ఫేర్ ప్రదర్శనలు, మార్చిలో గిరిజన కల్చరల్ ఫేస్ట్ వంటి కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించినట్టుగానే క్రీడలు, సైన్స్, గిరిజన కల్చరల్‌లో అదేవిధంగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పోటీల్లో గెలుపోటములు సహజమని ఓడినప్పుడు అధైర్య పడకుండా, తిరిగి ప్రయత్నించినప్పుడే విజయం సాధిస్తారని విద్యార్థులకు వివరించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల నృత్య, కళా ప్రదర్శనలు, ఆటలు, పాటలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతకు ముందు సమావేశ హాలులో నిర్వహించిన మాక్ పార్లమెంట్, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను పీఓ, అధికారులు పరిశీలించారు. గిరిజన కల్చరల్‌లో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి, గెలుపొందిన 51మంది విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అధికారులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్, భీంపూర్, జెడ్పీటీసీలు చారులత, సుధాకర్, ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్ కుమార్, డీటీడీఓలు మణెమ్మ, నీలిమ, ఏసీఎంఓ జగన్, ఏటీడీఓలు సౌజన్య, నిహారిక, క్రాంతి కుమార్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలి

- ప్లకార్డులతో నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఆత్మహత్యలపై విచారణ జరిపించి శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు ప్రచారం నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో అఖిల భారత విద్యార్థి సమఖ్యగా ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మడవి గణేష్, ఉపాధ్యక్షుడు మెస్రం ప్రవీణ్ కుమార్, నాయకులు సందీప్, బాదల్, తరుణ్, వరుణ్, మెస్రం గణేష్ పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక సాయం చేయాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రం శివారంలో కౌలు రైతు బాగనూరే లక్ష్మణ్ 7ఎకరాల శనగ పంటను కోత కోసి కుప్ప వేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుప్పకు నిప్పు పెట్టారు. దీనితో పూర్తిగా దగ్ధం కావడంతో రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి వచ్చిన పంట దహనం చేయడం, రైతుకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దాదాపుగా రెండు లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని అన్నారు. వచ్చే ఆదాయాన్ని కూడా కోల్పోవడం జరిగిందని అన్నారు. కాలిపోయిన పంటకి మన జిల్లా కలెక్టర్ స్పెషల్ గ్రాంట్ నుండి కాలిపోయిన పంటకి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు నాందేవ్, గంగాధర్ ఉన్నారు.


నేడు అన్నాభావు సాఠే విగ్రహా విష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో నిర్మించిన సాహిత్య సామ్రాట్ అన్నా భావుసాఠే విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు అన్నాభావు సాఠే కమిటీ జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే పేర్కొన్నారు. విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మెన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు వస్తున్నట్లు తెలిపారు. విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు ప్రతిఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పది పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి



నవతెలంగాణ-బాసర

పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. అనంతరం మన ఊరు మనబడి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న భోజనశాల పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు డీఈఓ సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ జోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముభారక్ 36 మంది లబ్ధిదారులకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న తల్లిదండ్రుల ముఖాల్లో చిరునవ్వులు నింపేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన వినూత్న పథకమే కళ్యాణలక్ష్మి అని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే మార్గదర్శకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, ఆర్డీఓ స్రవంతి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి సొసైటీ చైర్మెన్లు నారాయణరెడ్డి, మానిక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డి, పార్టీ కన్వీనర్ మాధవరావు, వైస్ ఎంపీపీ రాధ భూమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ దత్తురామ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్లు రాజ్ మమ్మద్, రవీందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, ఆలయ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను స్థానిక అంబేద్కర్ చౌక్ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్ మాట్లాడుతూ మహిళ అని చూడకుండా ఎమ్మెల్సీ కవితపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సంస్కారహీనుడైన బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉండటం సిగ్గుచేటని అన్నారు. అతడిని వెంటనే పదవి నుండి తొలగించాలని లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ మండల అధ్యక్షులు హైమద్ అజీమొద్దీన్, ప్యాక్స్ చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, జిల్లా నాయకులు కామెరి పోచ్చన్న, అన్సారీ, రమేష్, రవి, స్వామి ఉన్నారు.

ఎమ్మెల్యే రాజయ్యను వెంటనే పార్టీ నుండి బహిష్కరించాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాజయ్య తనను లైంగికంగా వేధిస్తున్నాడని మహిళ సర్పంచ్ నవ్య మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేసిన, సీఎం కేసీఆర్ స్పందించకపోవడం సిగ్గుచేటని ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికార పార్టీలో ఉన్న మహిళలకే రక్షణ కల్పించాలేని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఏం రక్షణ కల్పిస్తుందని ఆమె ప్రశ్నించారు. తమ పార్టీలో మహిళా సర్పంచే లైంగిక వేధింపులకు గురవుతున్నానని మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మహిళా మంత్రులు, ఎమ్మెల్సీ కవిత దీనిపై స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. సర్పంచ్ నవ్యకు తమ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ లక్మిబాయి,



మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, గంగమ్మ, కవిత, నశ్రీన, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్, కిష్టు, తుడం సంతోష్, విఠల్, నర్సిములు, గంగన్న యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ రూపేష్ రెడ్డి, దండు మధుకర్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు గానూ పలువురు స్వచ్ఛందంగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ, ఉదారతను చాటుకుంటున్నారు. అందులో భాగంగానే శనివారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోని బసవేశ్వర చౌక్ వద్ద వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమన్వయ సమితి అధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక కౌన్సిలర్ కలాల శ్రీనివాస్‌తో పాటు సమితి సభ్యులు మురళి మనోహర్, అన్నదానం జగదీశ్వర్, విజయ్ కుమార్, వి.శివప్రసాద్, శ్రీకాంత్, శేఖర్ పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజలకు అండగా నిలవడం పట్ల కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శక్తిపోషన్ నిర్మాణ్ బృందం సభ్యుల తనిఖీలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రధానమంత్రి శక్తిపోషన్ నిర్మాణ్ బృంద సభ్యులు శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహణ, పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల తీరును, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వాహణ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించి, మధ్యాహ్న భోజన పథక నిర్వహణ, పాఠశాల యాజమాన్య కమిటీ పనితీరు, గురించి తెలుసుకుని వారి అభిప్రాయాలు సేకరించారు. పాఠశాల నిర్వహణ గురించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బృందం సభ్యులు కవిత, ప్రవళిక, జీవన్‌లు, ప్రధానోపాధ్యాయులు వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అరుంధతి దేవి, విమల, అశ్విని పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని నిరాహార దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలంలోని, బట్టిసావర్‌గాం శివారంలో 72 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి పట్టాలు, తాగునీరు, కరెంటు సౌకర్యాలు, కల్పించాలని తుడుం దెబ్బ జిల్లా నాయకులు గోడం గణేష్ డిమాండ్ చేశారు. కుమురం భీమ్‌గూడ కాలనీలో శనివారం నిరాహార దీక్షలు చేపట్టారు. కుమురం భీం కాలనీలో ఇంటి పట్టాలు, కరెంటు సౌకర్యం, తాగునీరు కల్పించేంతవరకు దీక్షలు విరమింప చేయమని అన్నారు. మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తుడుం దెబ్బ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన పటేళ్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ ట్యాంకులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-కుభీర్

ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ ట్యాంకులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా శనివారం మృతదేహం లభ్యం అయ్యింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డోడర్నా తండా నెంబర్ 5కు చెందిన జాదవ్ సాయబరావు(24) యువకుడు ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లిపోయి ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ ట్యాంకులో పడి మృతి చెందాడు. దీంతో అటువైపుగా వెళ్లిన అదే గ్రామస్తుడు వాటర్ ట్యాంకు వద్ద సెల్ ఫోన్ మోగడంతో అక్కడికి వెళ్లి చూడగా మృతుడి దుస్తువులు సెల్ ఫోన్ చెప్పులు కనిపించడంతో సాయబరావు ట్యాంక్‌లో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి వచ్చి చూసేసరికి తన భర్తనే అని చెప్పడంతో పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేసి మృతుడి భార్య జాదవ్ సత్తిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యశ్వంత్ తెలిపారు.

బీమాతోనే కుటుంబానికి ధీమా

నవతెలంగాణ-గుడిహత్నూర్

తపాలా బీమాతోనే కుటుంబానికి ధీమా ఉంటుందని నిర్మల్ సబ్ డివిజన్ ఇన్‌చార్జీ ఇన్స్‌పెక్టర్ సుజిత్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తోషం పంచాయతీలోని బ్రాంచి పోస్టు ఆఫీస్‌లో తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఉప తపాలా కార్యాలయంలో బ్రాంచ్ పోస్టు మాస్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా జీవిత బీమా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. తక్కువ ప్రీమియం చెల్లిస్తే తపాలా శాఖలో ఎక్కువ బోనస్ వస్తుందని అన్నారు. ప్రతి బీపీఎం తప్పని సరిగా 10 పాలసీలు సేకరించాలని ఆదేశించారు. ఆసరా పింఛన్లు పొందుతున్న వారిచే ఆర్డీ ఖాతాలు తెరిపించి పొదుపు చేయించాలన్నారు. నేడు చేసిన పొదుపు భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సబ్ పోస్టుమాస్టర్ శేషరావు, ఎంఓ మునీర్, బ్రాంచి పోస్టు మాస్టర్లు స్వామి, కీర్తన, జ్యోతి, రాములు, ఖుర్షీద్ పాల్గొన్నారు.

రాగి జావ ప్యాకెట్ల పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి మండలంలోని వివిధ పాఠశాలకు వచ్చిన రాగి జావ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ ఆశన్న తెలిపారు. శనివారం నార్నూర్, గాదిగూడ, మండలంలోని పలు పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులకు రాగి జావ ప్యాకెట్లు సరఫరా చేశారు.

ఉత్తమ పోలీసులకు ఎస్పీ ప్రశంస

నవతెలంగాణ-దిలావర్‌పూర్



నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో జనవరి నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు జిల్లా ఎస్పీ సీహెచ్. ప్రవీణ్ కుమార్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎన్నికైన సందర్భంగా ఎస్సై గంగాధర్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మెరుగైన సేవలందించిన ఏఎస్సై భీంరావ్, స్టేషన్ రైటర్ కే.రమేష్, కానిస్టేబుల్ ఎండీ యాసిన్‌లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

నవతెలంగాణ-సిరికొండ

గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ ఓరగంటి నర్మద పెంటన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామ సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించుకోవడానికి సహకరించాలని సూచించారు. రూ.30లక్షల ఉపాధి నిధులతో ఈ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ లతీఫ్, ఉపసర్పంచ్ తోకల చిన్న రాజన్న, ఇక్బాల్, ప్రకాష్, మల్లారెడ్డి, లక్ష్మణ్, రాజు, దత్తు, లస్మన్న, స్వామి పాల్గొన్నారు.



శత చండియాగ కరపత్రాల విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయంలో శత చండీ మహాయాగాన్ని నిర్వహించ తలపెట్టినట్లు ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నవశక్తి దుర్గామాత ఆలయంలో శ్రీ రుద్ర సహిత శత చండీ, విశ్వ శాంతి మహా యాగానికి సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కిషన్ మహారాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. మహాయాగం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. భారీ ఎత్తున తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు. 108 యజ్ఞ గుండాలలో యాగ క్రతువును జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ పట్టణంలోని సుప్రసిద్ధ దుర్గామాత ఆలయంలో మార్చ్ 24, 25, 26లలో మహాయాగాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ యాగాన్ని నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, జైనథ్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ వేణుగోపాల్ యాదవ్, కౌన్సిలర్ భరత్ పాల్గొన్నారు.

గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ మృతి

నవతెలంగాణ-జన్నారం



గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ మతి చెందిన సంఘటన జన్నారం మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని గిరిజన ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వార్డెన్ భుక్యా దశరథ్(56) శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెనొప్పి రావడంతో మృతి చెందినట్లు అతని భార్య కమల తెలిపారు, మృతుడు మండలంలోని, కలమడుగు గ్రామపంచాయతీ రూప్ నాయక్ తండాకు చెందిన వ్యక్తి అతనికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. అతని మృతి పట్ల మండలంలోని ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు దిగ్బ్రాంతి వ్యక్తం చేశారు.

కవితపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



బండి సంజయ్ కల్వకుంట్ల కవితపై అనుచిత వాక్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పట్టణ మహిళా నాయయకురాలు అన్నారు. స్థానిక సూపర్ బజార్ లోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు మాట్లాడుతూ బండి సంజయ్ వెంటనే కవితకు క్షమాపణ చెప్పాలని లేదంటే తెలంగాణ మహిళలు రాష్ట్రంలో తిరగనివ్వమని హెచ్చరించారు.

నేడు ఐద్వ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం

ఐద్వ మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ శంకర్ తెలిపారు. శనివారం ఆమె పత్రికా విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని రామాలయం వాడలో ఆదివారం మధ్యాహ్నం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని, మహిళలు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

సీఎం కేసీఆర్ ప్రకటనతో పోడు రైతుల హర్షం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పోడు వ్యవసాయం చేసుకునే రైతులకు పట్టాలు అందజేసి రైతుబంధు రైతు బీమా పథకాలు అందేలా కృషి చేస్తామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడం పట్ల పోడు రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సార్సాల గ్రామంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ చిత్రపటాలకు పోడు రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడు రైతుల కోసం 90 రోజులపాటు 38 మందిజైలు జీవితాన్ని గడపడంతో పోడు రైతుల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది పోడు రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయాలి

- విజ్ఞాన్ సొసైటీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేస్తే ఎంతో మేలు జరుగుతుందని విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో రోడ్డుపై ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం అన్నింటికంటే గొప్పదని తెలిపారు. అన్నదానం చేయడం వల్ల ఆకలితో ఉన్న కొంతమందికైనా కడుపు నింపిన వాళ్లమవుతామని సూచించారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది గణపతి, రాకేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ కస్తూర్బా పాఠశాలలో ఎస్సై సమ్మయ్య ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాల పట్ల శనివారం బాలికలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు సెల్ ఫోన్ లా ద్వారా వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ వందకు డయల్ చేయాలని సూచించారు. మహిళలకు చట్ట భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ సంకల్పంతో ఉందన్నారు. వారి రక్షణకు షీ టీంలు నిత్యం పని చేస్తున్నాయని తెలిపారు. చట్టం దృష్టిలో బాల్య వివాహాలు నేరమని తెలిపారు. బలవంతపు బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రయాణం చేసేటప్పుడు లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీస్ శాఖను సంప్రదించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ కవిత, సుమన, సుధారాణి, సంధ్యారాణి, సుజాత పాల్గొన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

నవతెలంగాణ-భీమారం

చెన్నూర్ నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మంత్రి హరీష్ రావు ఈ నెల 15న రానున్న సందర్భంగా మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాద్ కేకన్ జైపూర్ ఏసీపీ నరేందర్‌తో కలిసి జాతీయ రహదారి రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిలోని నరహరి కల్వర్ట్ నిర్మాణం పనులు తుది దశకు కేరుకున్న పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కనే ఏర్పడిన మురికి గుంతను తక్షణమే మరమ్మత్తులు చేపట్టేందుకు సంబంధిత శాఖ చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ రాజు స్థానిక ఎస్సై సుధాకర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.



పత్తాలేని కు.ని శిబిరాలు..!

- ఇబ్బందులు పడుతున్న మహిళలు
- మహారాష్ట్రకు వెలుతున్న వైనం
- నాలుగేండ్లుగా కానరాని శస్త్రచికిత్సలు

నవతెలంగాణ-బెజ్జూర్

పేద మహిళలు కు.ని ఆపరేషన్ చేయించుకోవడానికి గతంలో ఎన్నో ప్రోత్సహాలు ఇచ్చి వారికి ఉచితంగా కుని ఆపరేషన్‌లు చేసేవారు. కు.ని శిభిరాలు నిర్వహించి శిభిరాలకు మహిళలను తీసుకవచ్చిన ఆశా కార్యకర్తలకు ప్రోత్సహా బహుమతులు ఇచ్చే వారు. ఒక్క రోజు వందల సంఖ్యలో ఉచితంగా కుటుంబ నియంత్రన శస్త్ర చికిత్సలు నిర్వహించే ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల నుంచి కునీ శిభిరాలు నిర్వహించడం లేదు. దీంతో పేద మహిళలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. తప్పని సరి పరిస్థితుల్లో ప్రయివేటు వైద్యులను సంప్రదించాల్సి వస్తోంది. దీంతో పేద ప్రజలకు కుని ఆపరేషన్ అంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా గత సంవత్సరం జులై నెలలో మాత్రమే కాగజ్‌నగర్‌లో కుని శిభిరాన్ని నిర్వహించారు. అక్కడక్కడ ఆడపా దడపా కుని శిభిరాలు నిర్వహించే అధికారులు కరోన తర్వాత కుని శిభిరాలపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలలో ఉచిత కుని శిభిరాలను ఎత్తి వేసినట్లే కనిపిస్తుందని జిల్లా వాసులు అంటున్నారు. ప్రయివేటు వైద్యశాలకు వెల్లడం ద్వారా ఎక్కువ డబ్బులు ఖర్చు అవుతున్నాయని, డబ్బులు లేని వారు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



మహారాష్ట్రకు వెలుతున్న మహిళలు

జిల్లాకు ఆనుకొని మహారాష్ట్రలో ఉచితంగా కుని శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండడంతో జిల్లాలోని మహిళలు ఎక్కువ శాతం మహారాష్ట్రకు వెలుతున్నారు. అక్కడ అవస్తలు పడుతూ కుని ఆపరేషన్లు చేసుకుంటున్నారు. బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపెల్లి, కౌటాల తదితర మండలాలకు చెందిన మహిళలు అహెరిలోని ప్రభుత్వ వైద్యశాలలో కని ఆపరేషన్లు చేసుకుంటున్నారు. మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం ప్రోత్సహకాలను ప్రకటిస్తుండడంతో పాటు, ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుందని అక్కడికి వెల్లడానికి మొగ్గుచూపుతున్నారు. ఎంత ఇబ్బందులు ఎదురైన ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడంతో పేద, మధ్యతరగతి వారు అహెరికి వెళ్ళి కుని ఆపరేషన్ చేసుకుంటున్నారు.

సర్జన్‌ల సాకుతో కుని శిభిరాలపై నీలి నీడలు

కుని శిభిరాలు నిర్వహించడానికి తగినంత వైద్య సిబ్బంది లేదనే సాకుతో కుని శిభిరాలు నిర్వహించడానికి అధికారులు ముందుకు రావడం లేదు. దీంతో కుటుంబ నియంత్రన శస్త్ర చికిత్సలపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. నాలుగు సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలకు భారం కానుంది. అధికారులు స్పందించి కుటుంబ నియంత్రన శిభిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. కుని ఆపరేషన్ చేసే సర్జన్ల కొరత జిల్లాలో వేదిస్తుండం కూడ కని శిభిరాలు నిర్వహించకపోవడానికి ఒక కారణం అవుతోంది. మారుమూల గ్రామాల్లో పనిచేయడానికి డాక్టర్లు మొగ్గుచూపకపోవడంతో పేద ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి త్వరగా కుటుంబ నియంత్రణ శిభిరాలు నిర్వహించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

కుని ఆపరేషన్లు చేయడం లేదు

మంగ దహెగాం



ప్రభుత్వ ఆస్పత్రిలో కుని ఆపరేషన్లు చేయడం లేదు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం చాలా పైసలు ఖర్చు అవుతున్నాయి. గతంలో మంచిగా శిభిరాలు నిర్వహించే వారు. ఇప్పుడు నిర్వహించడం లేదు. పేద వాళ్ల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అహెరీకి వెల్లి ఆపరేషన్లు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి కుటుంబ ఆపరేషన్లు నిర్వహించాలి.

నెలలో ఒక్క రోజు నిర్వహించాలి

విమల సిద్దాపూర్



ప్రతి నెల ఒక్కరోజైన కుటుంబ నియంత్రన శిభిరాలు నిర్వహించాలి. నాలుగు సంవత్సరాలుగా శిభిరాలు నిర్వహించడం లేదు. దీంతో మహిళలు ఇబ్బందిపడాల్సి వస్తుంది. మహారాష్ట్రకు వెలుతున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేస్తాం

ప్రభాకర్‌రెడ్డి జిల్లా వైద్యాధికారి.

త్వరలో జిల్లాలో కుటుంబ నియంత్రణ శిభిరాలు నిర్వహిస్తామని జిల్లా వైద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కరోన కరణంగా కొంత ఇబ్బందులు ఎదుర్కొవల్సి వచ్చిందన్నారు. సర్జన్‌ల కొరత కూడ ఎక్కువగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కరే సర్జన్ ఉన్నారని, ఇతర జిల్లాల నుంచి సర్జన్‌లను తీసుకవచ్చి కుని శిభిరాలు నిర్వహిస్తామన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై భగత్ సింగ్ స్ఫూర్తితో యువత పోరాటం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా విస్తత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సమస్యలపై తమ సంఘం ముందుండి పోరాడుతోందన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో దేశం వ్యాప్తంగా విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, హక్కుల కోసం పోరాడుతోందని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్యలను పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. యువత కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ, మతతత్వ, విధానాలని అర్థం చేసుకొని తిరుగుబాటు చేయాలని అన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికీ 74 సంవత్సారాలు కావస్తున్నా రాజ్యాంగ ఫలాలు అట్టడుగు ప్రజలకు అందడం లేదన్నారు. నేటికీ భారత దేశంలో ప్రజలు పేదరికంతో, ఆకలితో అలమటిస్తున్నారని అనేక సర్వేలు దీనిని నిజం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలు మరింత పేదలుగాను ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను హరించే దిశగా ఆర్ఎస్ఎస్, బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం తమ భావాలను వ్యక్తపరిచే హక్కు ప్రతీ పౌరుడికి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నేడు ప్రజల హక్కులపై దాడి చేస్తోందని విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కవులు, రచయితలు, మేధావి వర్గంపై భౌతిక, మానసికంగా దాడులు చేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, భావ ప్రకటన స్వేచ్ఛ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని దుయ్యబట్టారు. అంతేకాకుండా 2014 ఎన్నికలకు ముందు యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి నేటికీ దాన్ని అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని వచ్చే 2024 ఎన్నికలలో యువత అంత ఏకతాటిపై నిలబడి బీజేపీని ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొర్కుటే శ్యామ్‌రావ్, సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్ కుమార్, గెడం టీకానంద్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, నిఖిల్, సంతోష్, శ్రావణి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విదానాలను ఎండగట్టాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి
- 23 నుంచి జన చైతన్య యాత్రలు

నవతెలంగాణ-మంచిర్యాల



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విదానలను ఎండగట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం మత ఘర్షణలు సృష్టిస్తూ తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని కుటిల ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మరోపక్క ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడం, ప్రకృతి సంపదను బడా కాంట్రాక్టర్లకు దారాదత్తం చేయడం, విద్యా వైద్యాన్ని ప్రజలకు అందకుండా కార్పోరేట్ పరం చేస్తోందని విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాల్లో కోతలు విధించడంపై ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయడం కోసం సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో మార్చి 23న ఆదిలాబాద్ జిల్లాలో జన చైతన్య యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మార్చి 25వ తేదీన మంచిర్యాల జిల్లాకు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. యాత్రలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో బీజేపీ మతోన్మాద ప్రమాదాన్ని తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా జిల్లాలో అనేక సమస్యలు రాజ్యమేలుతుంటే వాటిని పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. జిల్లాలో సింగరేణి బొగ్గు బావులు, ఓపెన్ కాస్టులు ఉన్నాయని పేర్కొంటూ, సింగరేణి సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేయడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ప్రభుత్వ కుట్రను తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుమాస ప్రకాష్, కనికరం అశోక్, దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్, గుమాస అశోక్, దాగం రాజారాం, మిడివెళ్లి రాజు, రమణ, ఆరిగెల మహేష్, ప్రేమ్ కుమార్, తిరుపతి, శ్రీకాంత్, రాములు పాల్గొన్నారు.

కాసిపేటలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో మాజీ మంత్రి గడ్డం వినోద్ నాయకత్వంలో మంచిర్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో శనివారం హత్ సే హత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెండా ఎగరవేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి వినోద్ మండలములోని వ్యాపార సముదయాలు అన్ని తిరిగి రానున్న రోజుల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే రైతులకి రూ.2 లక్షల రుణమాఫీ, ధరణి పోర్టల్ రద్దు గ్యాస్ విద్యుత్ ధరలు ప్రజలకి అందుబాటులోకి రావాలంటే కాంగ్రెస్ గెలిపించాలని కోరారు. అనంతరం రత్నం ప్రదీప్ మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో బెల్లంపల్లి గడ్డం వినోద్ గెలిపించి కాంగ్రెస్‌ను రాష్ట్రంలో అధికారం లోకి తీసుకురావాలని, చెన్నూర్‌లో జైపూర్ పవర్ ప్లాంట్‌ని తీసుకొచ్చిన ఘనత గడ్డం వినోద్‌దే అని బెల్లంపల్లిలో కూడా అభివృద్ధి గడ్డం వినోద్ గారితోనే సాధ్యం అన్నారు. కార్యక్రమములో కాంగ్రెస్ నాయకులు బన్న ఆశాలు, గుండా రాజుకుమార్, సల్లూరి సమీల్, దుర్గం ప్రవీణ, బోర్లకుంట ప్రణయ్, షైక్ షారుఖ్, సురేష్, నైతం పద్మ, బన్న రవి రాజా పాల్గొన్నారు

బండి సంజయ్ దిష్టిబొమ్మ దాహనం



నవతెలంగాణ-జన్నారం

ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. సందర్భంగా మండల వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ మాట్లాడుతూ ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షునిగా ఉండి తెలంగాణ మహిళలను కించపరిచే విధంగా ఎమ్మెల్సీ కవితపై మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. ఆమెకు భహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మున్వర్‌అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి సిటీ మల భరత్ కుమార్, పొన్కల్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, తిరుపతి, లక్ష్మీనారాయణ, వాసాల నరేష్ పాల్గొన్నారు.

మంచిర్యాల : ఎమ్మెల్సీ కవిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వైఖరిని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఐబి చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, కౌన్సిలర్లు నాయకులు మాదంశెట్టి సత్యనారాయణ, అంకం నరేష్, తాజుద్దీన్, సుమతి, మోతే సుజాత, వసుంధర, గరిగంటి సరోజ, అశోక్ తేజ, జూపాక సుధీర్, జయరామారావు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపట్ల అధికార పార్టీ మహిళ నాయకురాళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురం వారు మాట్లాడుతూ బండి సంజయ్ వ్యాఖ్యలు దారుణమని అన్నారు. పురుష అహంకారంతో ఉన్న బండి సంజయ్ ఆ పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షురాలు గరిగంటి సరోజ, మాజీ మున్సిపల్ చైర్మన్ మామిడిశెట్టి వసుంధర, కౌన్సిలర్ మోతే సుజాత పాల్గొన్నారు.



కేరళ మోడల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-వేములవాడ

వేములవాడ పట్టణంలోని కేరళ మోడల్ స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలను శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంఈఓ బన్నాజీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. అనంతరం వివిధ కేటగిరిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కేరళ మోడల్ స్కూల్ 23వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. మండల విద్యాధికారి బన్నాజీ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని వారి భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలని సూచించారు. కౌన్సిలర్లు రామతీర్థపు కృష్ణవేణి, నరాల శేఖర్, ట్రస్మా టౌన్ ప్రెసిడెంట్ నరాల దేవేందర్, పట్టణ సీఆర్పీలు ఆకుల శ్రీనివాస్, ఎనగందుల నగేష్, కేరళ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ సతి మనోజ్ కుమార్, ప్రిన్సిపాల్స్ నితిన్ రాజ్, సత్య, విశాల్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు వైద్యుల అభినందన

నవతెలంగాణ-సిరిసిల్ల

సిరిసిల్ల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌ను పలువురు వైద్యులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెంచలయ్య, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, సిద్దిపేట వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ చందర్ స్వాగతం పలికి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.